క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో సునీత

బెజ్జూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో సునీత అన్నారు. ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈనెల 6 నుంచి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు హెచ్.కె పునేష్, ఎంఆర్‌సీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న ఫారెస్టు అధికారులు

తిర్యాణి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రం నుంచి చిన్నఅరటిపెల్లి స్టేజి వరకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు ప్రదేశాల్లో వివిధ మొక్కలను నాటడంతో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో ఇక్బాల్, సెక్షన్ అధికారులు భీమ్లానాయక్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



మొక్క నాటి నీరు పోస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ, ఏరియా ఆసుపత్రి, గోలేటి సీహెచ్‌పీతో పాటు అన్ని డిపార్టుమెంట్లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు, అధికారులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు రామనాథం, డీజీఎం ఉజ్వల్‌కుమార్, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట విజయవంతం చేయాలి

తిర్యాణి: నేటి నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖ అధికారులతో గురువారం బడిబాటపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యాలయ అవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో అంజయ్య, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం షాకీర్ ఉస్మాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బీమా చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పాలసీ తీసుకోవాలని ఎస్‌బీహెచ్ బ్యాంకు మేనేజర్ విష్ణు అన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఉర్వత్ దౌలత్ కుటుంబసభ్యులకు రూ. 2 లక్షల చెక్కు గురువారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో అందజేశారు. బీమా కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత సాధించాలని, బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది ఇందిరా, ప్రవీణ్, శ్రీకాంత్, సంతోష్, వానుపటేల్, మణిరాం, సునీల్, దిలీప్, ప్రకాశ్, తులసీదాస్, మనీష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి త‘రుణం’!

- వ్యాపారాలతో ఆర్థికంగా పరిపుష్టి
- బ్యాంకు, స్త్రీనిధి ద్వారా రుణాలు
- ఒక్కో సంఘానికి రూ. లక్ష నుంచి రూ.10 లక్షల వరకు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐకేపీ అధికారులు

కెరమెరి: రాష్ట్రప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోంది. వ్యాపార రంగంలో నిలదొక్కుకోవడానికి తక్కువ వడ్డీలకే రుణాలందిస్తోంది. కాంగ్రెస్ సర్కారు ఒక్కో మహిళా సంఘానికి గరిష్ఠంగా రూ.10 లక్షల రుణం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. స్వయం ఉపాధి కోసం అందించే రుణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడేలా చేస్తోంది. మహిళలే కేంద్ర బిందువుగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. వారు ఆర్థికంగా ఎదిగేలా ఐకేపీ సెర్ప్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కృషి చేస్తోంది. మహిళలు స్వయం సహాయక పొదుపు సంఘాల బలోపేతానికి బ్యాంకుల లింకేజీతో రుణసాయం అందిస్తోంది. వ్యాపార రంగంలో నిలదొక్కుకోవడానికి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజి ద్వారా రూ.15.77 కోట్లను మహిళా సంఘాలకు అందించేందుకు ప్రణాళికలు తయారు చేశారు. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా 11 క్లష్టర్లు ఉన్నాయి. 34 వీవోల్లో 526 గ్రామైఖ్య సంఘాల్లో 5233 మంది మహిళలు ఉన్నారు.

మహిళా బలోపేతం కోసం

మహిళలు బలోపేతం కావాలంటే ఆర్థికంగా లాభం చేకూర్చాలని ప్రభుత్వం భావించింది. ఇందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణా సహాయం మహిళలు ఆర్థికంగా ఎదిగి బలోపేతం అయ్యేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. కిరాణం. టైలరింగ్, దుస్తుల విక్రయ కేంద్రం, వ్యవసాయం, పాడి పశువుల పెంపకం, గిర్ని తదితర జీవనోపాధికి అవసరమైన యూనిట్లు నెలకొల్పేందుకు మహిళలు రుణాలు సద్వియోగం చేసుకుంటున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు వినియోగిస్తున్నారు. స్వయం ఉపాధి రుణాలు పొందడంతోపాటు ఆ రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా ఏపీఎం, సీసీ స్థాయి అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

గతేడాది రూ.14.44 కోట్లు

గతేడాది రుణలక్ష్యం రూ.14.44 కోట్లు ఖరారు చేశారు. 447 సంఘాల్లో ఆ మొత్తాన్ని పంపిణీ చేయగా రూ.13.04 కోట్లు వసూలు చేయగలిగారు. అంటే 90 శాతం రీ పేమెంట్ అయింది. మహిళల్లో కిరాణా, టైలరింగ్, పిండిగిర్ని, వ్యవసాయం, సొంత వాహనాల కొనుగోలు, బట్టల దుకాణం, ఇతర యూనిట్లు నెలకొల్పి ఆర్థికంగా ఎదగడానికి ఒక్కో సంఘానికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందజేశారు. దీంతో మహిళలు సొంతంగా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ఎదిగి కుటుంబంలో గౌరవం పొందుతున్నారు. ఏటా బ్యాంకు లింకేజీతోపాటు స్త్రీనిధి ద్వారా కూడా రుణాలు అందించారు. అయితే కొందరు మొండి బకాయిదారులు ఉంటే సీసీలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి రుణాలను రికవరీ చేయడంలో విజయం సాధించారు.

రుణాలు అందిస్తున్నాం



స్వయం సహాయక సంఘాలకు ఏటా లక్ష్యం నిర్దేశించుకొని రుణాలు అందిస్తున్నాం. మహిళలు ప్రతీనెల రుణాలు చెల్లింపుల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. గతేడాది 90 శాతం రుణాలు వసూలు చేయగలిగాం. ఈ సారి రుణ లక్ష్యంలో రూ.కోటి పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి వందశాతం రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జగదీశ్వర్, ఏపీఎం, కెరమెరి

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ రాంమోహన్

దహెగాం: భూభారతి 2025 చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని కో ట్మీర్, పోలంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ గణేష్, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ ఆధ్వర్యంలో రై తులను నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆ నంతరం వారు మాట్లాడుతూ.. భూ సమస్య ల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భా రతి చట్టం తెచ్చిందన్నారు. సమస్యలు ఉన్న రై తులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధి కారులు, రైతులు పాల్గొన్నారు.

బెజ్జూర్: రైతుల సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రాంమోహన్ అన్నారు. గురువారం మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న రైతుల సమస్యల పరిష్కారం కోసమే సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ అచ్యుతరావు, ఆపరేటర్ వంశీ, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఎమ్మెల్యే పరామర్శ

కాగజ్‌నగర్ టౌన్: వియత్నం దేశంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి అర్షిద్ అశ్రిత్ కుటుంబాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గురువారం ఆయన నివాసంలో పరామర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరు కృషి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 100 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా లారీ చౌరస్తా మీదుగా రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అటవీ శాఖ జిల్లా అధికారి నీరజ్‌కుమార్, ఎఫ్‌డీవో సుశాంత్, ఎఫ్ఆర్వో అనిల్, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, టీజీఎఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. గురువారం పట్టణంలోని ఎఫ్‌డీసీ కార్యాలయంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎస్పీఎం డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరీష్, ప్లాంటేషన్ మేనేజర్లు సురేశ్, లక్ష్మణ్, జలపతి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని అటవీ రేంజ్ కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

కౌటాల: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈవో హన్మంతు అన్నారు. గురువారం మండలంలోని ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ స్థాయి అధికారులు, మహిళ సంఘాల సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్, పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.



కౌటాల: మొక్క నాటుతున్న ఎంఈవో హన్మంతు



సిర్పూర్(టి): ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సిర్పూర్(టి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం సిర్పూర్(టి) ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సిర్పూర్(టి) అటవీశాఖ రేంజ్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు శ్రీధర్ చారి, ప్రవీన్‌కుమార్, సెక్షన్ అధికారులు మోహన్‌రావ్, తులసీదాస్, అత్తారుద్దీన్, ప్రసాద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడ, ఇందిరానగర్ గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు ప్రోసిడింగ్‌లు అందజేశారు. పుంజుమేరగూడకు చెందిన గుర్లె జమున, ఇందిరానగర్‌లో నల్లి బుజ్జక్కలకు చెందిన ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదలకు ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని అన్నారు. ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులకు త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, ఎంపీడీవో శంకరమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, నాయకులు సుదర్శన్ గౌడ్, చిరంజీవి, శ్రీనివాస్‌గౌడ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు

జొన్న రైతుల రాస్తారోకో

జైనథ్: జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటలకు మార్కెట్ యార్డ్‌కు వాహనాలతో వస్తే లోనికి అనుమతించడంలేదన్నారు. కలెక్టర్ ఆదేశాలతో రెండు రోజుల గడువు పొడిగించడంతో జొన్నపంట మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చామన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

పనులు చేయించేదెలా?

- నిలిచిన ఆర్థిక సంఘం నిధులు
- అప్పులు చేసి పనులు చేయిస్తున్న కార్యదర్శులు
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు



గురుడుపేట గ్రామపంచాయతీ కార్యాలయం

కౌటాల: గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇంతకాలం చిన్నచిన్న ఖర్చులు జేబుల్లో నుంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు నిధుల విడుదల కాకపోవడంతో ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో గ్రామాల్లో వీధి దీపాలు వెలుగకపోయిన, బోరు పనిచేయకపోయిన ప్రజలు సమస్యలతోనే జీవించాల్సి వస్తోంది. ఏడాదికి పైగా ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పైసా నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీ నిర్వహణ భారం కార్యదర్శులపై పడింది.

నిధులేవి..

జిల్లాలో 334 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో మేజర్ గ్రామపంచాయతీలతో పాటు చిన్న గ్రామ పంచాయతీలు కూడా ఉన్నాయి. సర్పంచ్ పదవీకాలం ముగిసిన వెంటనే ప్రభుత్వం పలు శాఖలోని సీనియర్ అసిస్టెంట్లను గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించి చేతులు దులుపుకుంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ పాలకమండలి లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం లేదు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెల రావాల్సిన ఎస్ఎఫ్‌సీ నిధులు ఆగిపోయాయి. గ్రామ సర్పంచులు లేకపోవడంతో ప్రతి పని పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులతో చేయాల్సి వస్తోంది. దీంతో పనులు చేయడానికి కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు.

ఆర్థిక పనులు బంద్..

పంచాయతీ కార్యదర్శులు మార్చి నెలలో ఇంటి పన్నులు, షాపుల అద్దెలు, ఇతర ట్యాక్స్‌లు వసూళ్లు చేసి వాటిని ట్రెజరీ ఖాతాల్లో జమ చేశారు. కానీ వాటిని సైతం పూర్తిస్థాయిలో వినియోగించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో పన్నులు వసూలైనా గ్రామాల్లో సైతం ఆర్థిక వెతలు తప్పడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు. ముఖ్యంగా ట్రాక్టర్ల డీజిల్, వీధి లైట్ల ఏర్పాటు, పారిశుద్ధ్య, స్పెషల్ డ్రైవ్, బ్లీచింగ్ పౌడర్, నల్లాల లీకేజీలకు మరమ్మతులు.. ఇలా గ్రామాల్లో అత్యవసరం కోసం ఖర్చు చేసే ప్రతీ పైసా పంచాయతీ కార్యదర్శి భరిస్తున్నారు. గ్రామ పంచాయతీల అవసరాల కోసం ఒక్కో పంచాయతీ కార్యదర్శి సుమారు రూ. వేలల్లో ఖర్చులు భరిస్తున్నారు. సొంత డబ్బులతో పనులు చేయించి అప్పుల పాలయ్యామని.. జూన్ నుంచి పంచాయతీల్లో ఎలాంటి పనులు చేయబోమని కార్యదర్శులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

ఆర్థిక పనులు చేయం



గ్రామాలు ఏడాదికి పైగా ప్రత్యేక పాలనలో కొనసాగుతున్నాయి. పాలకవర్గం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సైతం పంచాయతీ నిర్వహణకు నిధులు సక్రమంగా విడుదల చేయడం లేదు. దీంతో వేతనాలు సరిపోకపోవడంతో అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేస్తున్నాం. జూన్ నుంచి గ్రామాల్లో ఆర్థిక పరమైన పనులు చేయం.

– భాస్కర్, కార్యదర్శి, గుడ్లబోరి, కౌటాల



స్టేడియం కాదు.. జలాశయం

ఆకు పచ్చగా కనిపిస్తున్నది మైదానం అనుకుంటే పొరపడినట్లే. దహెగాం మండలంలోని కల్వాడ సమీపంలో ఎర్రవాగు, నల్లవాగులపై నిర్మించిన జలాశయంలో నీరు తగ్గు ముఖం పట్టడంతో పచ్చని గడ్డి మొలకెత్తి మైదానంలా కనిపిస్తూ.. ఆకట్టుకుంటుంది. – దహెగాం

ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి

నార్నూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిలువ ఉండకుండా పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యులు జితేందర్‌రెడ్డి, హెచ్ఈవో రాథోడ్ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.